# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జమిలి ఎన్నికల బిల్లుకు కేంద్రమంత్రి వర్గ ఆమోదాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వాగతిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **"భవాని దీక్ష 2024 " యాప్ ను దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ రోజు ఆవిష్కరించారు.**

3. **రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు ఇంధన పొదుపు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు.**

4. **రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నారు.**

=============================

జమిలి ఎన్నికల బిల్లుకు కేంద్రమంత్రి వర్గ ఆమోదాన్ని రాష్ట్ర ప్రభుత్వం స్వాగతిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. సాగునీటి సంఘాలు, సహకార, ఇతరత్రా ఎన్నికలు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయన్నారు. ఈసారి నిర్వహించే కలెక్టర్ల సదస్సులో అనేక మార్పులు తీసుకొస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

-------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 21 నుండి 25 వరకు జరిగే భవానీ దీక్ష విరమణల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. దీక్షా విరమణ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం రూపొందించిన "భవాని దీక్ష 2024 " యాప్ ను మంత్రి ఈ రోజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 32 సెకన్స్)

-------------------------

ఇంధన వనరుల పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు నుండి వారం రోజుల పాటు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం, విజయనగరం, ఎన్టీఆర్ జిల్లాల్లో పలు అవగహనా కార్యక్రమాలను నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన ఇంధన పొదుపు ర్యాలీలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మి శ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరూ

విధిగా ఇంధన పొదుపు పాటించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని కోరారు.

వాయిస్ (28 సెకన్స్)

---

రాష్ట్రంలో పర్యటిస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ –ఆర్‌ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఈ రోజు విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మోహన్ భగవత్ కు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోహన్ భగవత్ కు ఆలయ పండితులు వేదాశీర్వచనం చేయగా అధికారులు అమ్మవారి తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

---

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా ఈ రోజు తిరుపతి , అనంతపురం, విశాఖపట్నం జిల్లాల్లో లోక్ అదాలత్ ను నిర్వహించారు. ఇందులో భాగంగా అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ, సత్వర న్యాయం పొందటానికి లోక్ అదాలత్ లు దోహదపడతాయని అన్నారు. కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ తెలియజేస్తూ,

వాయిస్ ( 26 సెకన్లు)

---

ఛత్తీస్ గఢ్ లోని భిలాయ్ లో నిర్వహించిన జాతీయస్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024లో ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన 'చేజింగ్ హారిజన్స్' విద్యార్థుల బృందం విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 25 జట్లు పాల్గొనగా ట్రిపుల్ ఐటీ నూజివీడు జట్టు గెలుపొందిందని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతిని కేంద్రప్రభుత్వం అందజేసింది. ఈ విద్యార్థుల బృందాన్ని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్– ఆర్జీయూకేటీ డైరెక్టర్ ఎస్ అమరే ద్రకుమార్ అభినందించారు.

---

ఆడపిల్లలను రక్షించుకుందాం, భ్రూణ హత్యలు నిర్మూలిద్దాం అనే లక్ష్యంతో రేపు 2 కె పరుగును నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులో " సేవ్ ద గర్ల్ " నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంపై పశ్చిమగోదావరి జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఐ. సుబ్బరావు మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ( 32 సెకన్లు)

---

అందరి సహకారంతో ముప్పాళ్ళకు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు లభించిందని ముప్పాళ్ల గ్రామ సర్పంచి కుసుమరాజు వీరమ్మ తెలిపారు. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా జాతీయ స్థాయి

పురస్కారం అందుకున్న వీరమ్మ ఢిల్లీ నుంచి నిన్న గన్నవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల పంచాయతీకి జాతీయ పురస్కారం రావడం సంతోషంగా ఉందని చెప్పారు. అవార్డుతో పాటు తమ గ్రామాభివృద్ధికి కోటి రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకి కేటాయించిందని వీరమ్మ చేబుతూ,

వాయిస్ ( 14 సెకన్లు)

---------------------------

షెడ్యూల్డ్ కులాలు–వర్గీకరణపై విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్ర నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ ఈ నెల 16 నుంచి 19 వరకు రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో పర్యటించనుంది. 16న శ్రీకాకుళం, 17న విజయనగరం, 18న విశాఖ, 19న కాకినాడ జిల్లాల్లో పర్యటించనుంది. ఇందులో భాగంగా షెడ్యూల్డ్ కులాల్లోని ఉపకులాల వర్గీకరణకు సంబంధించిన అంశంపై విజ్ఞప్తులను నేరుగా స్వీకరించనున్నారు. నేరుగా సమర్పించలేని వారు విజయవాడలోని కార్యాలయంలో వ్యక్తిగతంగా, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా అందించవచ్చని రాజీవ్ రంజన్ మిశ్ర తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది..“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రైతులు పండించే పత్తిని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని పార్వతీపురం మన్యం జిల్లా మార్కెటింగ్ అధికారి ఐ.గంగాధర రావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు పత్తి రైతుల కోసం సాలూరు మార్కెట్ యార్డులో భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రైతులు దళారుల వద్దకు వెళ్లకుండా కొనుగోలు కేంద్రంలో పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కొనుగోలులో రైతులకు సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

=====================